### ఈమనోహరసమావేశాలు విస్మృతములైపోవుట విచారకరం

# జాతీయసమావేశాలు

"ఏది యెట్లయినను ఆంధ్రసోదరులు
ఈ రెండుజాతీయసమావేశములను
పునరుద్ధరించి దేశమునకు మాంగ
ళ్యమును సంఘటింప గోరెదను."

రచయిత :
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
(ప్రబుద్ధాంధ్ర సంపాదకులు)

శిథిలమైపోయిన జాతికి పునర్వికాసము గూర్పఁబూనినపుడు ముందుచేయవలసిన పని సంస్కరణమా? సముద్ధరణమా? యనిన రెండునూ అవసరములనియే తోఁచుచున్నది. దేశమునకు తటస్థించిన దౌర్భాగ్యదశ పరిపూర్ణమైనపుడు ప్రజలు ఎన్నటికి సంస్కరణాపేక్షలేని మంచి యాచారములను మఱచిపోవచ్చును. సముద్ధరణమే వానికి ముఖ్యమయినది. కొన్ని యాచారములను మఱచిపోవుటయే గాక యీకాలమున కవి పనికిరాకపోవచ్చును. వానివిషయమున సముద్ధరణమును, సంస్కరణమునుగూడ అవసరమగుచున్నది. ఆచరణమునందున్న యాచారములే కొన్ని యీకాలమునకు తగియుండక పోవచ్చును. వానిని సంస్కరింపవలెను.

ఆంధ్రజాతి నిన్న నేఁటిది గాదు. కొన్ని సమయములయందిది తన ప్రతిభను భారతదేశమునందంతటను విఖ్యాతపఱచినది గాని సామాన్యమైనది గూడ గాదు. అయితే యిప్పటి యీశైథిల్యమునకు కారణము జాతీయధర్మములును, జాతీయాచారములును సంకుచితములగుటయా? లేకున్న వానికి కాలవశమున తటస్థించిన వికృతియా?

ధర్మములును, ఆచారములును మంచివి గావని పూర్వపు సంఘనిర్మాతలమీఁద నాయాంధ్రసోదరులెవ్వరును రాళ్లు విసరరని తలఁచెదను. ఆంధ్రజాతి ఒక కాలమున మహోన్నతి నందుటకు ఏవి కారణములో అవి చెడ్డవి అగుట యెట్లు? అయితే జాతికి నేటి నికృష్ణస్థితి యేల కలిగిన దనిన వాని యెడల దేశీయులకు గాఢమిన ఔదాసీన్యమే కారణమని చెప్పెదను.

దేశమున అనేకాచారములు విలుప్తములైపోయినవి. అనేకములు విలుప్తప్రాయములై యున్నవి. మన చేతులతోడనే కొన్నిటిని జారవిడుచుచున్నాము. ఏదోయొక విధమున జాతియొక్క పునర్వికాసమును సాధించుటకు ఆంధ్రులు పూనుకొనినపుడు కొన్ని మంచి యాచారములు వినష్టములై పోవుచుండుట ఆశ్చర్యకరముగా నున్నది.

ఈసందర్భమున రెండు చిన్నజాతీయ సమావేశములనుగుఱించి చెప్పెదను; సంఘము కండ్లుమూసికొని గడచిపోవుచున్నదనుటకు ఈసమావేశములయెడల గాఢమిన ఔదాసీన్యము ప్రత్యక్షనిదర్శనమై యున్నది.

## వైశాఖపూజ

వైశాఖమాసము వసంతఋతువుయొక్క ఉత్తరభాగము. మాధవుని వైభవమునకు ముఖ్యచిహ్నములగు రకరకముల చూతఫలములు వైశాఖమున ముమ్మరముగా నుండును. చందనచర్చకు వసంతఋతువు చాల మంచిసమయము. వీవనల వినియోగముగూడ అవసరమైన సమయము. అట్టి యీవైశాఖమాసమున ఎన్నియోవందల యేండ్లనుండి నిన్న మొన్నటి వఱకును ఇప్పుడు మనము మఱచిపోయిన వైశాఖపూజ దేశీయులెల్లరును జేయుచుండెడివారు. ప్రతియూరునందే గాక ప్రతిబ్రాహ్మణుని యింటియందును ప్రతిక్షత్రియుని యింటియందును, ప్రతివైశ్యునియింటియందును, సరసమెఱింగిన ప్రతిశూద్రుని యింటియందును ఇది జరుగుచుండెడిది. ఇందులకై పాడుగూరి

పెద్దమనుష్యులనుగూడ పిలుచుకొనివచ్చెడివారు. నా బాల్యమున అనఁగా ఇరువది ఇరువదియైదు సంవత్సరములకు పూర్వము నేను అనేక గ్రామములలో ఈ వైశాఖ పూజ చూచియున్నాను. దీనికి పల్లెగ్రామము, పట్టణము అను భేదములేదు. ఇందులకు ముఖ్యములైన వీవనలు ఊరూరను దొరకును. మామిడిపండ్లు ఇంటింటికిని తెచ్చి యమ్ముదురు. మంచిగంధపుచెక్కలేని యిల్లు ద్విజులలో నుండనేయుండదు. ఎక్కడి కక్కడనే తమలపాకులతోటలు సమీపముననే యుండి తోటమొదలు సరసమైన వెలకు దొరకుచుండును. దేనికిని లోపములేదు; గాని శ్రద్ధయును, జాతీయాభిమానమునకును మాత్రమే తీరని లోపము కాన్పించుచున్నది. ఒక్కొక్క వ్యక్తికి మంచిగంధ మలఁది ఒక్కమాటు విసరి, వీవన చేతికిచ్చి, తాంబూలములో నుంచి ఘుమఘుమలాడు పసిఁడిమామిడి పండ్లు సమర్పించినపుడు పూజించినవారికిని, పూజింపఁబడినవారికినిగూడ కలిగెడు వసంతసుఖపారవశ్యము మహాకవుల వర్ణనమునకుఁగూడ స్వాధీనము కాని విషయము. అట్టి యీ జాతీయసమావేశమును ఆంధ్రులు బొత్తిగా మఱచిపోవుట శోచనీయము.

## వనభోజనము

వసంతమున ఈ వైశాఖపూజ అయిన తరువాత ఆంధ్రులకు ఇంత మనోహరమైన జాతీయసమావేశము శరదృతువులో ఏర్పఱుపఁబడినది. అదియే వనభోజనము.

ఉభయతారక మగు ఈ సమావేశము గూడ మనము మఱచిపోవుట చాల ఆపత్తికరము. కార్తికమున శ్రీమన్నారాయణుఁడు క్షీరసాగరమునుండి వచ్చి మహాలక్ష్మితో గూడ ధాత్రీమూలమున (ఉసిరిచెట్టు మొదట) నివసించును. ఈ మాసమున ఉసిరిచెట్టు మూలమున శ్రీ లక్ష్మీనారాయణులను పూజించి స్త్రీపురుషులు ఊరుబైటనున్న తోటలో చెట్ల నీడలయందు సుఖాసీనులై ఆనందముతో భుజించుట చూచి ఎన్నిదినము లయినది? ఎంత చక్కని సమావేశమును మనము మఱచిపోయినాము?

నా బాల్యమున వనభోజనముచేయని గ్రామము లేకుండెడిది. ఇరుగుపొరుగు గ్రామముల పిన్నపెద్దలనుగూడ పిలుచుకొనివచ్చి పిండివంటలలో చెట్లక్రింద శ్రీహరిసాన్నిధ్యము కల్పించి అన్నము పెట్టుటకంటె ఆంధ్రులయొక్క గర్వమున కేమి మూలముగలదు? అట్టి యీ ప్రకృష్టసమావేశమును మఱచిపోయిన మనము "ఆంధ్రులు ముందంజవేయుచున్నా"రని గర్వపడుట యెందులకు?

కాలము తల్లక్రిందులుగా మాఱిపోవుచున్నట్లున్నది. శక్తి ననుసరించి చేయఁదగిన యీ మనోహరసమావేశములు విస్మృతము లైపోవుచుండుటకంటె విచారకరవిషయములేదు. కాకినాడనగరమున జరిగిన స్వదేశీయ మహాజనసభకు ధర్మనిర్ణయము చేయుటకువచ్చెడి ప్రతినిధులగు దేశబంధువులకు అన్నమును విక్రయింపక మృష్టాన్నమును పెట్టి ఆంధ్రుల అతిథిపూజా వ్రతమును నిలుపవలసినదని రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు దేశీయులకు విన్నవింపఁగా జాతీయోద్ధారకులని ప్రసిద్ధివహించిన కొండా వేంకటప్పయ్యపంతులుగారు "ఈవ్రాతలను ఖండింపవలసిన"దని పత్రికలలో టెలిగ్రాములు కురిపించినారు. జాతీయోద్ధారకులని పిలువఁబడువారే జాతీయొక్క పవిత్రతను నిలుపఁదగిన, నిలువఁగల ఇట్టి మంచి సంకల్పములను త్రోసివైచినారనుట ఆంధ్రులకు లజ్జాకారణము గాదా?

ఏదియెట్లయినను ఆంధ్రసోదరులు ఈ రెండు జాతీయ సమావేశములను పునరుద్ధరించి దేశమునకు మాంగళ్యమును సంఘటింపఁగోరెదను.


### ఆలసించిన దొరకని హాస్యగ్రంథాలు

5 అణాల పోస్టుబిళ్లలు పంపితే

1. పెళ్లాన్ని ఎలాపిలవడం 2. అనుమానాలు ఆయన - ఆవిడ, 3. ధ్రువ, 4. చింకిజోడు, 5. తాళంచెవి తగాదా.

అనే ఐదు కడుపుబ్బ నవ్వించు హాస్యగ్రంథాలు పోస్టేజి మేమే భరించి మీకు పంపిస్తాము.

—నేడే పంపించండి—

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి పోస్టు, మద్రాసు.